# కాలానికి విలువ లేదు

సరిగ్గా ఎనిమిదయ్యేటప్పటికి కాలాంతకరావు 'యూనివర్సల్ టైమ్‌కీపర్స్' అనే వాచీకంపెనీ గుమ్మందగ్గర కొచ్చేడు. అతనక్కడ పనిచేస్తున్నాడు.

కుర్రాడు అప్పటికే తలుపులు తెరిచి, బూజులు దులపడం పూర్తిచేశాడు.

హోటల్లో 'చా' తాగి అహమ్మద్ హుస్సేనీ అనే మరోగుమాస్తాకూడా తిరిగి వచ్చేడు.

కాలాంతకరావు పని అంతా 'రిపేరింగు' శాఖలో. అక్కడ టేబిల్‌దగ్గర కూచుని వొచ్చిన ఆర్డర్లను తీసుకుని, వాళ్లవద్ద అడ్వాన్స్ తీసుకుని, రసీదుల్లో మళ్లీ ఏరోజు రావల్సిందీ రాసి రమ్మనమనడం.

వ్యాపారసరళిలో, మాటల చమత్కారంలో, కష్టమర్సుని బోల్తా కొట్టించే వాక్చక్యంలో అతనిది పెట్టిందిపేరు.

అబిడ్ రోడ్డులో వున్న ఆ దుకాణానికి మీరూ ఒకసారి కాకపోతే మరోసారయినా వెళ్ళివుంటారు, మీకు వాచీ అనే దస లోకటుంటే.

కాలాంతకరావు కీ రాష్ట్రంలోని ఐదు భాషలే కాక అరవం, బెంగాలీకూడా కొంచెం కొంచెం తెల్సు.

అతని ఈ భాషాప్రావీణ్యమే అతనికి ఆ శాఖలో ఉద్యోగాన్ని తెచ్చిపెట్టింది.

బూజులు దులిపాక కుర్రాడు చెయ్యాల్సినపని గడియారాల్ని అన్నిటిని ఒకే టైముకు తీసుకురావడం. 'ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని చూపవు' అనేదానికి ప్రత్యక్షసాక్ష్యం కావాలంటే ఏ వాచీ కంపెనీనైనా తెరిచేటప్పుడు చూస్తే కనబడుతుంది.

గడియారాలన్నీ సరిదిద్దేటప్పటికి తొమ్మిది అయింది.

కాలాంతకరావు కాఫీకి ఆర్డరిచ్చి తన 'కస్టడీ'లో వున్న గడియారాలనన్నీ పైకితీసి 'షోకేస్'లో తగిలించసాగాడు. ప్రతీ వాచ్‌కీ రిపైర్‌చార్జీ 8 నుంచి 30 రూపాయలవరకూ ఉంటుంది. మరమ్మత్తులకోసం రోజుకి ఓ వంద వాచీలన్నా రాకమానవు. సాధారణంగా వాచీకంపెనీలకి అదే ఓ పెద్ద రాబడి.

సొంత వాచీ అనేది ఒకటీ లేకపోయినా అతని చేతిని ఎప్పుడూ 300 రూ.లు విలువచేసే వాచీ వుంటుంది. మరమ్మత్తులకొచ్చిన వాంట్లో మంచిదాన్ని ముందు బాగు చేయించి చేతికి అలంకరించుకుంటాడు. ఒకవేళ దాన్ని స్వంతదారు చూస్తే 'టెస్ట్' చేస్తున్నాను అంటాడు.

ఆ కంపెనీలో ప్రపంచంలో దొరికే రకరకాలైన వాచీలన్నీ వుంటాయి. ఆ కొట్టుకి మొత్తం విలువకట్టడం అసాధ్యం. అందులోకి ప్రతీవాడూ ఆకర్షించబడతాడు; ఆకర్షించబడిన ప్రతీవాడి పనీ సాలిగూటిలో దూరిన ఈగలా అవుతుంది; ఏదో ఒకటి కొనకండా బయటికి రాలేడు — బీదవాడైనా ధనవంతుడైనా! 20 నుండి 1500 రూపాయలవరకూ విలువచేసే వాచీలున్నాయి. అక్కడి గుమాస్తాలు 'కాఫీ' 'టీ'లు ఇచ్చి, 'కాప్స్టన్' సిగరెట్‌లు ఇచ్చి ఎలాగో ఒకలా వాళ్ళని లోబర్చుకోగలుగుతారు. 'టోపీ' లో పడుతున్నామనే ఆలోచన ఆ ఖాతాదార్లకి తెలీదు. ఏదో లాభసాటి బేరంతో బయట పడుతున్నామనుకుని సంతోషిస్తారు, ఆ అమాయికులు. కాని వాళ్ళు వెళ్ళగానే

## శాంతి కృష్ణమూర్తి

గుమాస్తాలు వాళ్ళల్లోవాళ్లు నవ్వుకుని 'ఎంతలా టోపీ వేయగలిగిందీ?' 'ప్రజలు ఎంత అమాయికులైందీ!' తెల్సుకుని సగర్వులవుతారు.

అంతకంటె ఆశ్చర్యకరమైన విషయాలు కాలాంతకరావుశాఖలో జరుగుతాయి.

"ఏమండీ నావాచీ నాలుగు నిమిషాలు ఫాస్ట్ తిరుగుతోందండి"

"నావాచీ 8 నిమిషాలు స్లో తిరుగుతోందండీ."

"నావాచీకి రేడియం డైయల్, ముల్లు, స్టెయిన్‌లెస్‌స్టీల్ కేసూ వెయ్యాలండీ."

"నావాచీకి ఓవర్ ఆయిలింగ్ (ఓవర్‌హాలింగ్ అనడానికి బదులు) చెయ్యాలండి"

ఇలా అనేకులు అనేకవిధాలైన రిపేర్లకోసం వస్తూంటారు. వాళ్ల అమాయికత్వాన్ని చూస్తే అతనికి ఆశ్చర్యం, విషాదం కలుగుతాయి. ఓ నిమిషం ముందుగా నడుస్తేనేం, ఓనిమిషం ఆలస్యంగా తిరుగుతేనేం? ఏదో పుట్టె మునిగిపోయినట్టు ఎందుకూ ఈ అనవసరపు ఖర్చు. నిజంగా మనుషులు 'సెకన్ల'మీద నడుస్తున్నారా?"

అతనిలో అతను నవ్వుకునేవాడు. కాని అతనిఉద్యోగమే అది! ఎవళ్ళకిగాని వాళ్ళ అమాయకత్వాన్ని ఎత్తి చూపడంకన్న, నిర్లక్ష్యంచేస్తేనే ఎక్కువ సంతోషం కలుగుతుంది. 'పై ప్రజలు మూర్ఖులు; గ్రహించలేరు' అనుకుని ఆత్మసంతుష్టి చెందుతారు. కాని వెనకాల నవ్వులూ, హేళనలూ వాళ్ళకు తెలీవు.

కాలాంతకరావు ఇంటర్ ఫెయిలయ్యాడు. అతని విజ్ఞానశాస్త్రంమీద గల గాఢాభిమానం మాత్రం చావలేదు. అందువల్ల విజ్ఞానశాస్త్రంలో గల పుస్తకాల్నన్నిటినీ వీలుదొరికినప్పుడు చదివేవాడు. ప్రజల వింతభావాల్ని చూసినప్పుడు మనస్సులో ఇలా అనుకునేవాడు:

'కాలం అంటే ఏమిటి? దానికి ఓ విలువ వుందా? మనం అనుకునే కాలప్రమాణం, నెలలూ, రోజులూ, గంటలూ, నిమిషాలూ, క్షణాలూ, తారీఖులూ వీటన్నిటికీ నిజమైన విలువలున్నాయా? ఏ క్రీస్తుచావుతోనో, పుట్టుకతోనో లేక, ఇంక దేనితోనో సంబంధాన్ని పెట్టుకుని కాలపుకొలతలు నిర్ణయించుకుని దానికి దాసులమవడం మన మానసిక దౌర్బల్యాన్ని చూపించదా?'

ఎంత ఆలోచించినా అతనికి కాలానికి స్వంత విలువవున్నట్టు తోచలేదు, దేనితోనో 'రెలెటివ్'గా ఆలోచిస్తేనే తప్ప.

అదీగాక ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని ఎప్పుడూ చూపించవు అనే యధార్థాన్ని అతను కళ్ళారా రోజూ చూస్తూనేవున్నాడు. అందుకనే తన దుకాణంలో రోజూ మూడు గంటలకోకసారి గడియారాలటైంని కలపవల్సి వొస్తోంది. దానికోసం నలభైరూపాయల జీతంమీద ఒక కుర్రాడ్ని నియమించుకున్నారుకూడా!

'సూక్ష్మదృష్టితో చూస్తే ఏదో ఒక ప్రమాణం లేకపోతే సాధారణపు పనులు జరగడం కష్టం. అందుకే ఈగడియారాలూ, వాచీలూ' అనుకున్నాడు.

వాచీలు షోకేస్‌లో తగిలించి, కాఫీ సేవించేసరికి, ఎవరో వచ్చి "ఈ వాచీ చూడండి; మరమ్మత్తు కెంతవుతుందో అనసాగారు.

కాలాంతకరావు లేని నవ్వుని తెచ్చుకుని తన పనిలో నిమగ్నమవసాగాడు. ★


శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ 1-0-0
ఆంధ్ర గ్రంథమాల, మదరాసు 1